క్లుప్తంగా

యువకుడికి సన్మానం



యువకుడిని సన్మానిస్తున్న నాయకులు

కుభీర్: మండలకేంద్రానికి శేఖర్ అనే యువకుడు ఇటీవల సీఆర్పీఎఫ్ జవాన్‌గా ఉద్యోగం సాధించాడు. మంగళవారం గ్రామంలో సదరు యువకుడిని మాదిగ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. బీఆర్ఎస్ మండల మాజీ ఉపాధ్యక్షుడు మోహినొద్దీన్, మాజీ సర్పంచ్ జి.బాబు, ఎన్నిల అనిల్, పుప్పాల పిరాజీ, కాంగ్రెస్ నాయకుడు కల్యాణ్, బీజేపీ నాయకుడు సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుభీర్: భైంసాలో ఈనెల 5న జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీల్లో కుభీర్ చాణుక్య సాంస్కృతిక పాఠశాల విద్యార్థులు 10మంది ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ పి.నరేశ్ తెలిపారు. రెడ్ బెల్టు సాధించిన ఎస్.అఖిలప్రియ, టి.మధుప్రియ, టి.హరిసింగ్, టి.ఆరుష్, దీక్షిత్, విశాంత్, సాయి సుశాంత్, నిక్షిత్, రిషిక్, సాకేత్‌ను పాఠశాల కరస్పాండెంట్ సతీశ్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ



దివ్యాంగులతో ఫౌండేషన్ సభ్యులు

భైంసాటౌన్: లూయిస్ బ్రెయిలీ జయంతి పురస్కరించుకొని పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో దివ్యాంగ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 60 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పంచగుడి మహేశ్, ఎస్‌బీఐ మేనేజర్ మురళీకృష్ణ, పీఆర్టీయూ నాయకులు రమణరావుతో కలిసి దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. దివ్యాంగశక్తి సభ్యులు, మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దాడులు చేస్తే సహించబోం'

భైంసాటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి హేయమైన చర్య అని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఎవరినైనా విమర్శించే హక్కు ఉందన్నారు. దాడులు చేస్తే సహించబోమని.. ఏదైనా ఉంటే చట్టప్రకారం ముందుకెళ్లాలని పేర్కొన్నారు. అధికార దుర్వినియోగం సరికాదన్నారు. దాడి చేసిన దుండగులను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తి అరెస్ట్

నిర్మల్‌టౌన్: సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా తప్పుడు ప్రచారం చేసిన నిర్మల్‌కు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కొద్దిరోజుల కిందట కుమురంభీం జిల్లాలో జరిగిన ఓ ఘటనలో బాధితురాలిని మంత్రి సీతక్క పరామర్శించారు. దీనిపై నిర్మల్ పట్టణానికి చెందిన రిజ్వాన్ సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా ప్రచారం చేస్తున్నాడని కాంగ్రెస్ నాయకులు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం రిజ్వాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి గ్రామంలో రేపన్ నాగారావుతోపాటు బూరుగుపల్లి భీమన్న- లక్ష్మి దంపతుల కూతురు ఇటీవల మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబాలను సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్ పరామర్శించి 50 కిలోల చొప్పున బియ్యం బస్తాలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకుడు సాహెబ్ రావు, సీతఊట అనిల్‌కుమార్, బర్కుంట ముత్యం, రవి గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్శనానికి తరలిన స్వాములు

కుంటాల: మండలకేంద్రం నుంచి పలువురు అయ్యప్ప స్వాములు మంగళవారం శబరిమలలోని అయ్యప్ప దర్శనానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వాములు జక్కని గజేందర్, కడార్ల హరిప్రసాద్, ఉదయ్‌కుమార్, ఆకాశ్ ఆధ్వర్యంలో ఇరుముళ్లు కట్టుకొని బయలుదేరారు. అంతకుముందు శ్రీ ఉమా మహేశ్వరాలయంలో పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాములను సాగనంపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పచ్చబంగారానికి తెగుళ్లు



లోకేశ్వరం మండలంలోని నగర్‌తండాకు చెందిన ఈ రైతు పేరు రాథోడ్ ప్రకాశ్. తనకున్న ఆరు ఎకరాల్లో వివిధ పంటలతోపాటు ఇరవై గుంటల్లో పసుపు సాగు చేశాడు. పసుపు సాగుకు రూ.50వేలు పెట్టుబడి పెట్టగా.. అధిక వర్షాలకు దుంపకుళ్లు తెగులు సోకి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. సస్యరక్షణ చర్యలు పాటించినప్పటికీ తెగులు అదుపులోకి రాలేదు. జిల్లాలోని పసుపు రైతులందరిదీ ఇదే పరిస్థితి.

- ఆందోళనలో రైతులు
- అధిక వర్షాలతో దుంపకుళ్లు ఉధృతి
- పెట్టుబడులు వచ్చేలా లేవంటున్న అన్నదాతలు



నగర్‌తండాలో తెగులు సోకిన పసుపు పంట

లోకేశ్వరం: వాణిజ్య పంట అయిన పసుపును దుంపకుళ్లు తెగులు వదలడం లేదు. మద్దతు ధర ఉన్నా.. లేకున్నా జిల్లాలోని మెజార్టీ రైతులు దీనిని తమ ఇంటి పంటగా భావించి.. ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. ఇప్పటికే మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న పసుపు రైతులకు ఈ ఏడాది తెగుళ్లతో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అధిక వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పసుపు పంటకు దుంపకుళ్ల తెగులు సోకింది. దీంతో దిగుబడులు తగ్గి పెట్టుబడులూ వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 5,542 వేల ఎకరాల్లో సాగు..

నిర్మల్ జిల్లాలో 5,542 ఎకరాల్లో పసుపు పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. మామడ, సారంగాపూర్, సోన్, లోకేశ్వరం, నిర్మల్, దిలావర్‌పూర్ మండలాల్లో అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. కొమ్ములు విత్తిన తర్వాత రెండు నెలలపాటు ఆశాజనకంగా ఉన్నప్పటికీ.. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో అధిక వర్షాలతో భూమిలో తేమశాతం పెరిగి తెగులుకు నిలయంగా మారింది.

పెట్టుబడులు అధికం..

ఎకరం విస్తీర్ణంలో పసుపు పంట సాగు చేసేందుకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. కొమ్ములు విత్తడం, కూలీల ఖర్చు, కలుపు తీయడం, ఎరువులు, పురుగుమందుల పిచికారీ, తవ్వకాల వరకు ఖర్చులు అవుతున్నాయి.

ఆకులు ఎండి..దుంప ముగిరిపోయి

కొన్ని చోట్ల పసుపు పంట ఆకులు పచ్చగా ఉండి.. భూమిలో దుంపకుళ్లు సోకితే మరికొన్ని ప్రాంతాల్లో ఆకులు ఎండిపోయి.. భూమిలో దుంప ముగిరిపోయింది. పసుపు మొక్కను చేతితో తేలికగా భూమిలో నుంచి బయటకు వస్తుంది. ప్రస్తుతం పసుపు కొమ్ములు ఊరే దశ కావడంతో దుంపకుళ్ల కారణంగా.. ఎకరాల కొద్దీ పంట నష్టం జరుగుతోంది. జిల్లాలో దాదాపు రెండు వేల ఎకరాల్లో పంటకు దుంపకుళ్ల సోకినట్లు తెలుస్తోంది. గతేడాది ఎకరాకు 40 డ్రమ్ముల (25 క్వింటాళ్లు) వరకు పసుపు దిగుబడి వస్తే ఈ ఏడాది కనీసం 20 డ్రమ్ములు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



ఎకరంలో పసుపు పంట సాగు చేశా. అధిక వర్షాల కారణంగా భూమిలో నీరు నిలిచి.. పంటకు తెగుళ్లు సోకింది. దీంతో దిగుబడి సగానికి పడిపోతుందేమోనని అనిపిస్తుంది. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. – మంద లింగన్న, ధర్మోర

వర్షాలు దెబ్బతీశాయి



ఈసారి అధిక వర్షాలు పసుపు పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. నీరు బయటకు వెళ్లలేక చేనులోనే నిల్వ ఉండటంతో దుంపకుళ్లు సోకింది. ఈసారి నష్టం వస్తుందని భయంగా ఉంది. – శ్రీధర్, ధర్మోర

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



రాచాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై సుమలత



ముధోల్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సారంగపూర్: ప్రతి ఒక్కరూ విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలకేంద్రంలో వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహనం నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అతివేగంతోపాటు మద్యం తాగి నడిపినా.. సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: వాహనదారులు..కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్సై సుమలత పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని రాచాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలో ఎస్సై సంజీవ్ వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సు, బీమా, తదితర పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

సోన్: మండలకేంద్రంలోని మాదాపూర్ ఐబీ వద్ద ప్రజలకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాహనాలను వేగంగా నడపకూడదని, తప్పనిసరిగా సీట్ బెల్టు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని తల్వేద ఎక్స్‌రోడ్ వద్ద రూరల్ ఎస్సై లింబాద్రి వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్, బీమా తదితర పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి'

లోకేశ్వరం: ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోస్లే బాజీరావు పటేల్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలు, బీసీల అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్లు కేటాయింపు, బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు వంటి హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కైరి శ్రీకాంత్, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి మురళి, జిల్లా కార్యదర్శి నల్ల రమేశ్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్ కుమార్, సాయికిరణ్, మహిళా మోర్చా నాయకులు హీనాఫిర్దోస్ ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

భైంసాటౌన్: సివిల్ సప్లయ్ హమాలీల సమస్యలు పరిష్కరించాలని హమాలీ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద చేపట్టిన నిరవధిక సమ్మెకు జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు సుంకెట మహేశ్‌బాబు మద్దతు తెలిపి మాట్లాడారు. ఏడు రోజులుగా సమ్మె చేస్తున్న హమాలీల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షుడు ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం ఎదుట సివిల్ సప్లయ్ హమాలీలు చేపట్టిన సమ్మె ఏడోరోజుకు చేరింది. హమాలీల సమ్మెకు కడెం, దస్తురాబాద్ మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు అజీజ్ అహ్మద్, కె.రాజేశ్వర్ మద్దతుగా బైఠాయించారు. భీమేశ్, నర్సయ్య, చిన్నయ్య, భూమారెడ్డి తదితరులున్నారు.



ఖానాపూర్‌లో హమాలీలకు మద్దతుగా బైఠాయించిన రేషన్ డీలర్లు

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయండి

లక్ష్మణచాంద: ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు చేపట్టిన సర్వేను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవో రాధ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో వందశాతం ఇంటి పన్నులు వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నర్సరీల్లో పెంచే మొక్కలకు సంబంధించి నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఇందులో ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో ప్రమీల, టీఏలు దినేశ్, భీమ్, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

సర్వే కానివారు దరఖాస్తు చేసుకోండి..

మామడ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వివరాలు నమోదు చేసుకోనివారు బుధవారం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలనలో ఇచ్చిన రసీదుతోపాటు ఆధార్ జిరాక్స్‌ను జత చేసి ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించండి

సోన్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వెల్మల్ బొప్పారం గ్రామాల ప్రత్యేకాధికారి రాజమల్లు అన్నారు. మంగళవారం మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బియ్యం, ఇతర సరుకులతో భోజనం రుచికరంగా వండి.. విద్యార్థులకు అందించాలని సిబ్బందికి సూచించారు. ఆహార పట్టికను గోడకు అతికించాలని హెచ్‌ఎం నాలం విద్యాసాగర్‌కు సూచించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆయిల్ ప్యాకెట్ పరిశీలిస్తున్న అధికారి రాజమల్లు

చెడు వ్యసనాలకు దూరం ఉండాలి

కుంటాల: విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ చెడు వ్యసనాలకు దూరం ఉండాలని ఎస్సై సీహెచ్.భాస్కరాచారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం.రాజేశ్వర్, సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్, జిల్లా వైస్ చైర్మన్ లక్ష్మణరావుపటేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న ఎస్సై భాస్కరాచారి

నర్సరీ పరిశీలన

తానూరు: మండలంలోని నంద్‌గాం గ్రామంలో ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన నర్సరీని మంగళవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు నీటిని అందిస్తూ సంరక్షించాలని సూచించారు. టీఏ ప్రసాద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రి కాలనీకి చెందిన సచిన్‌వార్ హరీశ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. మంగళవారం వార్డు కౌన్సిలర్ చందూలాల్ ఆధ్వర్యంలో యువకుడిని సన్మానించారు. ఏపీ నగర్ కాలనీకి చెందిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లంక గంగాధర్, రాజేందర్ పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు



సోన్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్సై గోపి



ఖానాపూర్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు, పోలీస్ సిబ్బంది



కడెంలో తనిఖీ చేస్తున్న ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

భైంసాటౌన్/కడెం/మామడ/కుంటాల/ఖానాపూర్/సోన్/కుభీర్/సారంగపూర్/లోకేశ్వరం: గాలిపటాలు ఎగురవేసేందుకు నిషేధిత చైనా మాంజా విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామని భైంసా పట్టణ సీఐ గోపినాథ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. కడెంలోని పతంగుల దుకాణాలను అటవీశాఖ అధికారులతో కలిసి ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి తనిఖీ చేశారు. మామడలో దుకాణాలను ఎస్సై సందీప్ తనిఖీ చేశారు. పండుగ వేళ చైనా మాంజాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కుంటాల ఎస్సై సీహెచ్.భాస్కరాచారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఖానాపూర్‌లో మాంజా వినియోగంతో కలిగే నష్టాలపై ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై రాహుల్ గైక్వాడ్ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. గాలిపటాలు ఎగురవేసేందుకు సాధారణ దారం మాత్రమే వినియోగించాలని సూచించారు. గాలిపటాల విక్రయ కేంద్రాలు, జనరల్ స్టోర్లు, టైలరింగ్ షాపులు, కిరాణా దుకాణాలను తనిఖీ చేశారు. సోన్‌లో కిరాణ దుకాణాలను సోన్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సై గోపి తనిఖీ చేశారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు. లోకేశ్వరంలోని దుకాణాలను ఎస్సై అశోక్.. సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఏఎస్సై దిగంబర్, సిబ్బంది ఉన్నారు.

చుట్టూ గోడలు లేని భవనాలు ఎక్కవద్దు..

సంక్రాంతి పండుగ నేపథ్యంలో గాలిపటాలు ఎగురవేసేటప్పుడు చుట్టూ గోడలు లేని భవనాలు ఎక్కవద్దని కుభీర్ ఎస్సై పి.రవీందర్ ఓ ప్రకటనలో తెలిపారు. చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని.. సాధారణ దారం ఉపయోగించాలని సూచించారు.సారంగపూర్‌లోని దుకాణాలను ఎస్సై శ్రీకాంత్ తనిఖీ చేశారు. శిక్షణ ఎస్సై నవనీత్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

విద్యార్థుల హాజరు పెంచాలి



రాయిపూర్‌కాండ్లీ పాఠశాలలో హాజరు పరిశీలిస్తున్న ఎంఈవో చంద్రకాంత్

లోకేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూడాలని ఎంఈవో చంద్రకాంత్.. ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని అర్లి–గొడిసెరా, రాయపూర్‌కాండ్లీ గ్రామాల్లోని ప్రాథమికోన్నత పాఠశాలలను ఎంఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఈవో మాట్లాడుతూ నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవిదాస్, శ్రీనివాస్, ఆనంద్ ఉన్నారు.

అందుబాటులో యూరియా

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి వసంత్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 868 యూరియా బ్యాగులు అందుబాటులో ఉన్నాయని.. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో వచ్చి యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

'విచారణ జరిపి చర్యలు తీసుకోండి'

కడెం: మండలకేంద్రంలోని పారిశుధ్య కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్న కడెం పెద్దూర్ పంచాయతీ కార్యదర్శి మునిరుల్‌హసన్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, పస్పుల వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని నిర్మల్–మంచిర్యాల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా పని చేస్తున్న కొందరు పారిశుధ్య కార్మికులను తొలగించడం సరికాదన్నారు. కార్మికులను తిరిగి పనుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎంపీవో కవిరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నయ్య, దుర్గం లింగన్న, కోటయ్య, పలువురు కార్మికులు గంగవ్వ, నర్సవ్వ, గంగాధర్ తదితరులున్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ముగియనున్న పారాయణం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాస్త్రినగర్ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న మహా సాయి పారాయణం బుధవారం ముగియనుంది. షిర్డీ సాయిపల్లకి, సాయి పాదుకలను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. షిర్డీ నుంచి వచ్చిన వికాస్ మహారాజ్.. సాయిబాబా చరిత్ర, మహిమలను వివరిస్తున్నారు. మంగళవారం కృష్ణ అనే భక్తుడు సాయిబాబా వేషధారణలో కనువిందు చేశాడు. భక్తులకు కిచిడి ప్రసాదం అందజేశారు. సాయిదీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటలకు పురవీధుల గుండా సాయి పల్లకి శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. పారాయణ ప్రాంగణంలో మధ్యాహ్న హారతి, అనంతరం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు చెక్కుల పంపిణీ

ముథోల్: మండలకేంద్రంలో బుధవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

అదుపుతప్పిన కేజీవీల్స్ ట్రాక్టర్

- డ్రైవర్‌కు తప్పిన ముప్పు

కడెం: పొలం దున్నుతుండగా కేజీవీల్స్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని గంగాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గంగాపూర్‌కు చెందిన మీసాల నర్సయ్య తన ట్రాక్టర్‌తో గ్రామ శివారులో ఓ పొలం దున్నుతుండగా కూరుకుపోయింది. స్థానికుల సాయంతో కేజీవీల్స్‌కు కర్రలు కట్టి ట్రాక్టర్‌ను బయటకు తీసేందుకు యత్నించగా అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ నర్సయ్య అప్రమత్తమై ట్రాక్టర్‌పై నుంచి దూకడంతో త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.



పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్